క్లుప్తంగా

రూ. 7.40 లక్షలతో అభివృద్ధి పనులు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని 48వ డివిజన్ కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి తెలిపారు. ఉప్పలపాటి రామచంద్రరాజు వీధిలో రూ. 7.40 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆదిలక్ష్మి సోమవారం శంకుస్థాపన చేశారు. కొండ ప్రాంతాల్లో దెబ్బతిన్న మెట్లు, డ్రెయిన్లు, రోడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టమే కాకుండా అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. డివిజన్‌లో దాదాపు 70 శాతం మేర కొత్త రోడ్లు వేశామని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు (జగ్గు), తొత్తడి వరలక్ష్మి, బాయన అమర్‌నాథ్, గాలి రామారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

చందన్ పటేల్‌కు అవార్డు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో లయోలా కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో కూరపాటి పాఠశాల విద్యార్థి చందన్ పటేల్‌కు అవార్డు లభించింది. పదో తరగతి చదువుచున్న చందన్ పటేల్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బిల్లి రమేష్ సహకారంతో ఫైర్ అలార్మ్‌ను తయారు చేసి పోటీలో ప్రదర్శించాడు. దానిని ఎంపిక చేసిన నిర్వాహకులు పాఠశాలకు డిస్ట్రిక్ట్ లెవెల్ ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్‌ను ప్రకటించారని పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య తెలిపారు. అవార్డు రావటం పాఠశాలకు ఎంతో గర్వకారణమని కార్యదర్శి కూరపాటి నారాయణరావు పేర్కొన్నారు.

రేడియో కేంద్రంలో షరీఫ్ కథల ప్రసారం



రచయిత వేంపల్లి షరీఫ్

విజయవాడ కల్చరల్: ప్రముఖ కథా రచయిత, పరిశోధకుడు వేంపల్లి షరీఫ్ కథలు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో ప్రసారానికి ఎన్నికైనట్లు ప్రసార భారతి అధికారుల నుంచి సమాచారం అందిందని కథా రచయిత వేంపల్లి షరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన రచించిన కథా సంపుటి చారల పిల్లి ఇతర కథల సంపుటి నుంచి దారి తప్పిన కల, చారులపల్లి, కోయేట్ లెక్క, నల్లబండ, నీలంరంగు రాయి, ఉంగరం, నీలం రంగు రాయి కథలను 14 వ తేదీ నుంచి ప్రసారం చేస్తారని పేర్కొన్నారు. షరీఫ్ కథానికా ప్రపంచంలో విశేషమైన కృషి చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికచేసి ప్రసారం చేసింది.

జూదరులను కోర్టుకు హాజరుపరిచిన పోలీసులు

గన్నవరం: మండలంలోని సూరంపల్లి శివారులో కోడి పందేలు నిర్వహిస్తూ పట్టుబడిన 47 మంది జూదరులను సోమవారం కోర్టులో హాజరుపరిచారు. డీఎస్పీ జయసూర్య ఆదేశాల మేరకు హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పోలీసులు కోడి పందేల శిబిరంపై దాడి చేసిన విషయం తెలిసిందే. పట్టుబడిన జూదరులపై గన్నవరం పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీస్‌స్టేషన్‌లోనే సోమవారం నిందితులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక బస్సులో 47 మందిని స్థానిక అదనపు జూనియర్ సివిల్ కోర్టులో జడ్జి ముందు హాజరుపరిచారు. అనంతరం జడ్జి ఆదేశాల మేరకు రూ.20 వేలు వ్యక్తిగత పూచీకత్తుపై నిందితులకు కోర్టు బెయిల్‌పై పోలీసులు విడుదల చేశారు. ఈ కేసులో సుమారు రూ.10 లక్షల నగదు, 19 కార్లు, 32 బైక్‌లు, 58 కోడి పుంజులను పోలీసులు జప్తు చేశారు.

16న విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

నెమలి(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రముఖ ఆలయమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీన విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం, రథసప్తమి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గోపాలకృష్ణ సుదర్శన హోమం, సూర్యనారాయణ మహా మంత్ర హోమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనే వారు ముందుగా దేవస్థానం కార్యాలయంలో రూ.1116 చెల్లించి తమ పేరు గోత్రనామాలను నమోదు చేయించుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 95736 22446 నంబరులో సంప్రదించాలని సహాయ కమిషనర్ తెలిపారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్



రైతు బజార్‌లో చిరు వ్యాపారులకు సంక్షేమ కరపత్రాలు అందిస్తున్న షేక్ ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ఈ రాష్ట్రానికి వైఎస్ జగనే సీఎం కావాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ అన్నారు. భవానీపురం 42వ డివిజన్‌లో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ పి.చైతన్యరెడ్డితో కలిసి సోమవారం ఆయన పర్యటించారు. డివిజన్‌లోని రైతు బజార్ రోడ్డు, నూరి మసీదు రోడ్డు, రాపాక వారి వీధుల్లో ఇంటింటికి తిరిగారు. రైతు బజార్‌లో కూరగాయలు, పండ్ల వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. నవరత్నాలు పథకాల ద్వారా నేరుగా లబ్ధి చేకూరుస్తుందని పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఈ తరహా పాలన అందించలేదన్నారు. ఈ ప్రభుత్వం హయాంలోనే విజయవాడ నగరం అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విజయవాడ నగరాన్ని నిర్లక్ష్యం చేసిందన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి రావాలన్నారు. జగనన్న ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు మనోజ్ కొఠారి, బండి పుణ్యశీల, డైరెక్టర్లు, డివిజన్ నాయకులు, గృహ సారథులు పాల్గొన్నారు.

● డాక్టర్ పట్టాభిరామయ్యకు సత్కారం



ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గురునానక్ కాలనీలోని ఎన్‌ఏసీ కళ్యాణ మండపంలో సోమవారం రాత్రి సీనియర్ డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య మిత్ర బృందం ఏర్పాటు చేసిన వృత్తి విరామ అభినందన సత్కార సభకు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. డాక్టర్ పట్టాభిరామయ్యను మిత్ర బృందం ఘనంగా సత్కరించింది. జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ వైద్య రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన కామినేని పట్టాభిరామయ్య ఆదర్శప్రాయుడని అన్నారు. విలువలతో కూడిన జీవితాన్ని ప్రారంభించిన ఆయన వైద్య రంగంలో విశేషమైన సేవ చేశారని కొనియాడారు. నిబద్ధత కలిగిన వ్యక్తిగా సమాజానికి నిస్వార్థ సేవలందించారని పేర్కొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

బీఎల్ఎస్ పద్ధతులపై అవగాహన పెరగాలి

దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు



అవగాహన సదస్సులో పాల్గొన్న దంత వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రాణాపాయ సమయంలో అత్యవసరంగా అందించే బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జరీ (ఓఎంఎఫ్ఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్తా ఆంధ్రా బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ, దవడ ఎముకలకు గాయాలు కాకుండా వాహనదారులు హెల్మెట్ వాడాలని చెప్పారు. ప్రాణాపాయం సమయంలో అందించే పల్మనరీ రీససిటేషన్ (పీసీఆర్) ఆ వ్యక్తికి పునర్జన్మను ప్రసాదిస్తుందన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారు సడన్‌గా గుండె ఆగిపోయే అవకాశం ఉందన్నారు. అలాంటి వారికి ఈ విధానం ఎంతో అవసరం అన్నారు. ఈ సందర్భంగా బేసిక్ లైఫ్ సపోర్టు విధానాలపై దంత వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఓఎంఎఫ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ కె.సురేఖ, డాక్టర్ సీహెచ్ రామసునీల్, డాక్టర్ భవన్‌చంద్, డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలి

కృష్ణా వర్శిటీ పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు ప్రారంభం



కీడాకారులను పరిచయం చేసుకుంటున్న శేషయ్య

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): క్రీడాకారులు అన్ని రంగాల్లోనూ రాణించి చక్కని విజయాలను అందుకోవాలని కేబీఎన్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తొమ్మండ్రు శేషయ్య అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల హ్యాండ్ బాల్ పోటీలు సోమవారం ఆ కళాశాల ఆవరణలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన శేషయ్య మాట్లాడుతూ క్రీడాకారులు అన్ని రంగాల్లోనూ రాణిస్తారన్నారు. గెలుపోటములకు అతీతంగా విద్యార్థులందరూ పోటీలకు హాజరుకావాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల 58 సంవత్సరాలుగా క్రీడా రంగంలో మంచి గుర్తింపు పొందిన క్రీడాకారులను తయారు చేసిందన్నారు. కార్యక్రమాన్ని కళాశాల క్రీడా విభాగాధిపతి డి. హేమచంద్రరావు నిర్వహించారు. ఈ పోటీలకు యూనివర్సిటీ టీమ్‌ను ఎంపిక చేయటానికి సెలక్షన్ కమిటీ మెంబర్‌గా డాక్టర్ ఎల్ హెచ్‌ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల మైలవరం వ్యాయామధ్యాపకుడు మన్నే స్వామి, ఎస్ఏఎస్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు బాయన రాములు తదితరులు పాల్గొన్నారు. మొదట నాకౌట్ పద్ధతిలో పోటీలు జరిగాయి. డీఏఆర్ కళాశాల (నూజివీడు) డాక్టర్ ఎల్ హెచ్ ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ (మైలవరం) మీద 10–2 గోల్స్‌తో విజయం సాధించి లీగ్ టోర్నమెంట్‌లోకి ప్రవేశించారు. రెండవ నాకౌంట్లో కేబీఎన్ పీబీ సిద్ధార్థ మీద 26–8 స్కోర్‌తో విజయం సాధించి లీగులోకి ప్రవేశించింది. లీగ్ పోటీల్లో మొదటగా కేబీఎన్ కళాశాల ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలపై 26–6. ఆదిక్యతతో సాధించింది. అలాగే డీఏఆర్ కళాశాల వికాస్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (నున్న) మీద 19–10 ఆధిక్యతతో విజయం సాధించింది మంగళవారం మిగిలిన లీగ్ పోటీలు నిర్వహించి విజయం సాధించిన వారికి బహుమతులు అందించనున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందిస్తున్న నాగభూషణం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో బాగంగా తుళ్లూరు జిల్లా పరిషత్ హైస్కూలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. రహదారి భద్రతపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గవర్నర్‌పేట–2 డిపో మేనేజర్ ఎస్.నాగభూషణం బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల, నిర్లక్షంగా డ్రైవింగ్ చేయటం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాల వల్ల తామే కాకుండా తమ కుటుంబ సభ్యులు, ఎదుటి వారు ఇబ్బందులు పడాతారన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు.

15 అఖండ ఖచ్చపీ మహోత్సవం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో 15వ తేది గురువారం సంస్థ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా అఖండ ఖచ్చపీ(వీణా వాద్య సమ్మేళనం) దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయం ఎనిమిది గంటలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి రచించిన ఘన రాగ పంచరత్న కృతులను గానం చేస్తారని తర్వాత వీణా వాద్య సమ్మేళనం, రాత్రి తొమ్మిది గంటల వరకు వీణ కచేరీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ వై రాఘవేంద్రరావు, సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ పాల్గొంటారని పేర్కొన్నారు.

శివగిరిపై అఘోరాల పూజలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాఘమాసం మొదటి సోమవారం సందర్భంగా స్థానిక మొగల్రాజపురంలోని శివగిరిపై ఉన్న శివలింగానికి ఉజ్జయిని నుంచి ఏడుగురు అఘోరాలు వచ్చి పూజలు చేశారు. ప్రతి ఏడాది మాఘమాసం సందర్భంగా అఘోరాలు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడి శైవ క్షేత్రాలను సందర్శిస్తారు. అందులో భాగంగా విజయవాడ వచ్చి తమ క్షేత్రాన్ని సందర్శించారని శివగిరి వ్యవస్థాపకుడు మల్లికార్జునశర్మ చెప్పారు. అఘోరాలను చూడటానికి, వారు శివలింగానికి పూజలు చేసే విధానాన్ని చూడానికి స్థానికులు ఆసక్తి చూపించారు.

ఆయిల్ లీక్‌తో వాహనదారుల ఇక్కట్లు



పెనమలూరు: గోసాల గ్రామ పరిధిలో విజయవాడ– మచిలీపట్నం జాతీయ రహదారిపై ఆయిల్ పడటంతో పలువురు వాహనదారులు ప్రమాదానికి గురయ్యారు. గోసాల ఇస్లాంపేట వద్ద బందరు రోడ్డుపై వాహనం నుంచి ఆయిల్ లీక్ అయ్యి రోడ్డుపై పడింది. ఇది గమనించకుండా వాహనదారులు ఆయిల్‌పై వెళ్లటంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. ఇది గమనించిన వైఎస్సార్ సీపీ నేత, 8వ వార్డు సభ్యుడు అఫీజ్‌పాషా ప్రమాదం జరగకుండా బారికేడ్లు అడ్డుగా పెట్టి, చెట్టు కొమ్మలు రోడ్డుపై వేశారు. ఆయిల్‌పై ఇసుక వేసి ప్రమాదాలు నివారించారు.

రేపు సరస్వతీ దేవిగా దుర్గమ్మ దర్శనం

● ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

● విద్యార్థులకు పెన్ను, కంకణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీపంచమిని పురస్కరించుకుని 14వ తేదీ బుధవారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌తో పాటు లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవ మూర్తిని సరస్వతీ దేవిగా అలంకరిస్తారు. త్వరలో జరగనున్న వార్షిక పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని అర్చకులు ఆశీర్వదిస్తారు. అమ్మవారి ప్రధాన ఆలయంలోఅర్చకులు సరస్వతీ మంత్ర హవనం చేసి విద్యార్థులకు అందజేసే పెన్నులతో పాటు అమ్మవారి కంకణాలకు పూజలు నిర్వహిస్తారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులకు పెన్ను, కంకణంతో పాటు చిన్న సైజు ఫొటో, కుంకుమ ప్రసాదాలను పంపిణీ చేస్తారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల కోసం లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రధానాలయంలో విద్యార్థులకు ముఖ మండప దర్శనానికి అనుమతిస్తారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం, స్కూల్, కాలేజీ గుర్తింపు కార్డును ధరించిన వారికి మాత్రమే పెన్నులను అందజేస్తారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గుణదల(విజయవాడతూర్పు): శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలు దిశగా అడుగులు వేయాలని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. లయోలా కళాశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 11వ జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మట్లాడుతూ విద్యార్థుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని చెప్పారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజాభివృద్ధి అనేది ఏదో ఒక మంచి ఆలోచన నుంచి ఉద్భవిస్తుందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతమైన ఆలోచనల ద్వారా సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యున్నతమైన ప్రతిభను కనబరిచి ఆవిష్కరణలను రూపొందించి ప్రదర్శించడం అభినందనీయమన్నారు. అధునాతన టెక్నాలజీని విద్యార్థులు ఉపయోగించుకునేలా ప్రభుత్వం ప్రయోగశాలలను ఆధునికీకరించి అవసరమైన పరికరాలను అందుబాటులోకి తీసుకొస్తోందని వెల్లడించారు. శాస్త్రీయ దృక్పథాన్ని మరింత పెంచుకుని నూతన ఆవిష్కరణల ద్వారా గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేయాలని కోరారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడంపై అధ్యాపకులు దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 125 మంది విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. డిప్యూటీ మేయర్ ఎ.శైలజారెడ్డి పాల్గొన్నారు.

వీఎంసీ స్పందనలో ఏడు అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న వీఎంసీ సీఈ ప్రభాకర్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులకు వీఎంసీ కల్పిస్తున్న మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సీఈ ప్రభాకర్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలోని వాయిస్ సెక్షన్‌లో కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో సోమవారం స్పందన నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఏడు అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగంపై–3, పట్టణ ప్రణాళిక–3, ఎస్టేట్–1 ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి స్వీకరించిన ఫిర్యాదులను ఆ శాఖాధిపతులకు పంపి వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) రోహిణి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ –3 డాక్టర్ బాబు శ్రీనివాస్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లత, అసిస్టెంట్ సిటీ ప్లానర్ జగదీష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రాధాన్యత



వంటల పోటీలు కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది

విజయవాడ కల్చరల్: మహిళా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే, పార్టీ విజయవాడ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సంప్రదాయ వంటల పోటీలను దుర్గాపురంలోని సంగీత కళాశాలలో సోమవారం నిర్వహించింది. పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ మహిళలు సామాజిక, సాంఘిక, సాంస్కృతిక రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనను స్వాగతించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. శ్రీదేవి సాంస్కృతిక సేవా సమితి వ్యవస్థాపకురాలు దూపాటి శ్రీదేవి మాట్లాడుతూ సంస్థ ద్వారా సాంస్కృతిక పోటీలతో పాటు సృజనాత్మకతను చాటే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ ముగ్గుల పోటీలు, దసరా మహోత్సవాల సమయంలో విచిత్ర వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వంటల పోటీల్లో 300 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. నవీన్, మోహన్‌రావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

పాలిటెక్నిక్ కళాశాలకు ఇంజిన్ కట్ మిషన్ అందచేత



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు మిషన్‌ను అందచేస్తున్న దృశ్యం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని ఆటోమొబైల్ రంగంలో నూతన ఆవిష్కరణలు చేయలని ఇసుజు మోటార్స్ ఇండియా ప్రవేట్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ టకాషి రికుకవ చెప్పారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆటోమొబైల్ విభాగంలో విద్యార్థుల బోధనకు అవససరమైన లక్ష రూపాయల విలువ గల ఇంజన్ కట్ సెక్షన్ (మోడల్ బీఎస్6) మిషన్‌ను ఇసుజు మోటార్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉచితంగా అందచేశారు. టకాషి రికుకవ సోమవారం కళాశాలకు వచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథికి అందచేశారు. ఈ సందర్భంగా టకాషి రికుకవ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు తమ సంస్థ ఉచితంగా ఆటోమొబైల్ ఇంజిన్ కట్ మిషన్‌ను అందచేస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడానికి ఈ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. లక్ష రూపాయల విలువైన మిషన్ ఇసుజు సంస్థ ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. కళాశాల విభాగాధిపతులు ఎం.నాగరాజు, బి.శైలజ, ఎస్‌వీవీ రమణ, కేవీఎస్ ఫణి, జి.వేణుగోపాల్, డి.సునీత జి.రాకేష్, కె.సాయికుమార్, బాబూజీ, సీహెచ్.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

జువెనైల్ హోమ్‌లోని పిల్లలకు క్రీడల్లో శిక్షణ



విద్యాధరపురంలోని జువెనైల్ హోమ్‌లో పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతున్న అనిల్‌కుమార్, ప్రసాదమూర్తి

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశంలోని వివిధ రాష్ట్రాల్లో గల ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహాల్లో (జువెనైల్ హోమ్) ఉంటున్న పిల్లల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) రూపొందించిన 'నయా దిశ' (స్మైల్ ఫర్ జువెనైల్స్) ప్రాజెక్టును సంస్థ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా హోమ్‌లోని పిల్లలకు బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్ క్రీడల్లో శిక్షణ ఇవ్వటంతో పాటు ఆయా క్రీడలకు సంబంధించిన స్పోర్ట్స్ కిట్స్ కూడా ఐఓసీ అందజేస్తుంది. ఈ సందర్భంగా విద్యాధరపురం కబేళా రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ బీడీవీ ప్రసాదమూర్తి, ఐఓసీ స్టేట్ హెడ్ (తెలంగాణ–ఆంధ్రప్రదేశ్) బి.అనిల్ కుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హోమ్‌లోని పిల్లల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయని తెలిపారు. క్రీడల వలన క్రమశిక్షణ, టీమ్ వర్క్ అలవడుతుందన్నారు. హోమ్‌లోని పిల్లలు ఆయా క్రీడల్లో నిష్ణాతులయ్యే వరకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దుతారని చెప్పారు. ముఖ్యంగా వారిలోని నేర ప్రవృత్తిని పోగొట్టి సమాజంలో భాగస్వాములుగా తయారు చేస్తారని తెలిపారు. సమావేశంలో ఐఓసీ డీజీఎం (హెచ్‌ఆర్) వి.కుమార్, జువెనైల్ హోమ్ చీఫ్ ప్రొహిబిషన్ ఆఫీసర్ టి.మధుసూదనరావు, సూపరింటెండెంట్ పి.రామమోహన్‌రెడ్డి, ఐఓసీ మేనేజర్లు విద్యాధర్, లలిత్‌బాబు, గౌతమ్‌కుమార్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.